నగరంలోని శంషాబాద్ పోర్ట్ గ్రాండ్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోదరుడు సురేశ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమద – డాక్టర్ భీమేశ్ రెడ్లిల వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, శైలిమ దంపతులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు, నాయకులు గ్యాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్ రెడ్డి, రవీంద్ర నాయక్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల కృష్ణారెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, కర్నె ప్రభాకర్‌లు ఉన్నారు.

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావును ఆదివారం కలిసిన బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర.

ఉద్యమకారుల వీరోచిత పోరాటంతోనే తెలంగాణ ఆవిర్భావం

తెలంగాణ ఉద్యమకారులను అభినందిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, నవంబర్ 17: ఉద్యమకారుల వీరోచిత పోరాటం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధి మల్లికార్జున కాలనీలోని ఎస్ఎన్ఆర్ బంకెట్ హాల్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉద్యమకారుల ఫోరం చైర్మన్ వాసు యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమంలో పాల్పంచుకున్న పలువురు ఉద్యమకారులను వారు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిపెస్టోలో ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తామని, ఇళ్ళ స్థలాలు కేటాయిస్తామని చెప్పి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఊసెత్తక పోవడం విచారకరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరోటి అని విమర్శించారు. తెలంగాణ ఉద్యకారులకు బీఆర్ఎస్ పార్టీ మాత్రమే అండగా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి సముచిత స్థానాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కాలంలో పోలీసు కేసులు నమోదైన వారికి ప్రభుత్వం బాసటగా నిలువాలన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు సైతం అమలు చేయడంలో మీనమేశాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదిలోనే హంసపాదు అన్న చందంగా ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని ఆరోపించారు. రూ.4 వేలు పింఛన్లు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం వలన ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందాల బల్దేవ్ రెడ్డి, ఉపాధ్యక్షులు జానకి రెడ్డి, గ్రేటర్ కన్వీనర్ గుండు దయానంద్, నరేందర్ గౌడ్, మక్కల నర్సింగ్, సయ్యద్ ఎజాజ్, మేకల హరినాథ్, మక్కల సత్యనారాయణ, పోచయ్య, రాంబాబు, జగన్ యాదవ్, కంటోన్మెంట్ ఇన్‌చార్జి ప్రభుగుప్త తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో శ్రీ అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పలు రకాల శాస్త్రీయ నృత్యాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అందులో భాగమే ఈ దృశ్య భంగిమ.

నేడు మేడ్చల్ ప్రజావాణి రద్దు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 17: గ్రూప్-3 పరీక్షల సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ఈ సోమవారం రద్దు చేస్తున్నట్టు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

పైలెట్ ప్రాజెక్ట్‌లో భూ సర్వే

- ప్రారంభించిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం
- కేఎంఎల్ మ్యాప్(గూగుల్)లో పొందుపరిచేలా చర్యలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసెన్డ్ భూముల గుర్తింపు
- ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలయ్యాయా? అన్న కోణంలో విచారణ
- రక్షణ శాఖ భూములకు ఖాతా నెంబర్ల కేటాయింపు

మేడ్చల్, నవంబర్17(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద భూ సర్వేను రెవెన్యూ యంత్రాంగం ప్రారంభించింది. ప్రభుత్వ భూములలో పైలెట్ ప్రాజెక్ట్ కింద సర్వే నిర్వహించి కేఎంఎల్ మ్యాప్(గూగుల్)లో పొందుపరిచేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసెన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ యంత్రాంగం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. ఈ క్రమంలో భూ పరిరక్షణకు జిల్లా రెవెన్యూ డివిజన్ స్థాయిలో సర్వేను కొనసాగిస్తున్నారు. అలాగే, భూ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు విధి విధానాలపై ప్రణాళికను రూపొందించింది. గుర్తించిన భూముల పరిరక్షణకు ప్రహరి, ఫెన్సింగ్ వంటి చర్యలపై దృష్టి సారించారు. అయితే, జిల్లాలో రెవెన్యూ రికార్డుల ప్రకారం, 5,195 ఎకరాల ప్రభుత్వ భూమి

ఉందని తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం ప్రభుత్వ భూమి గత లెక్కల ప్రకారం.. ఉందా? లేక కబ్జాలకు గురైందా? అన్న విషయం సర్వే అనంతరం తేలనుంది.

ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలు!

జిల్లాలోని ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలు జరిగాయా? అన్న కోణంలో విచారణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో మండలాల తహశీల్దార్లు గత రికార్డుల ప్రకారం ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లలో ఏమైనా ప్రైవేటు వ్యక్తులకు పట్టాలుగా మారాయా? అన్న దానిపై సర్వే నెంబర్ల ఆధారంగా పరిశీలిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ భూమి పట్టాగా మారిన క్రమంలో ఉన్నతాధికారులు ప్రభుత్వ భూములపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఒక వేళ ప్రభుత్వ భూమి పట్టాలుగా మారితే తక్షణ చర్యలు తీసుకుని తిరిగి ప్రభుత్వ భూములుగా మార్చుతామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలుగా మార్చిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రక్షణ శాఖ భూములకు ఖాతా నంబర్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న రక్షణ శాఖ భూములకు ఖాతా నంబర్లను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట్ తదితర మండలాలలో రక్షణ శాఖ భూములు వేలాది ఎకరాలలో ఉన్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు రక్షణ శాఖ భూములు లెక్కల ఆధారంగా ఖాతా నంబర్లను కేటాయించనున్నారు. రక్షణ శాఖ భూములకు ఖాతా నంబర్లను కేటాయించడాన్ని త్వరలోనే పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రిమెచ్యూర్డ్ పిల్లలపై అప్రమత్తత అవసరం

- సినీ నటుడు ఆది సాయి కుమార్

మాదాపూర్, నవంబర్ 17: నెలలు నిండక ముందే పుట్టే పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉన్నట్లయితే, ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని సినీ నటుడు ఆది సాయి కుమార్ అన్నారు. కొండాపూర్‌లోని కిమ్స్ దవాఖాన ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే వాక్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథులు సినీ నటులు సాయి కుమార్, ఆది విచ్చేసి కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెలలు నిండక ముందే పుట్టే పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోనట్లయితే జీవితాంతం ఇబ్బందులు పడతారని చెప్పారు. ప్రసవం సరైన దవాఖానలో అన్ని వసతులు ఉన్నచోటే చేయించుకోవాలని, అప్పుడే పుట్టబోయే పిల్లలకు ఎటువంటి డోకా ఉండదన్నారు. ప్రతి ఎనిమిది మంది పిల్లల్లో ఒకరు నెలలు నిండక ముందే జన్మిస్తున్నారని, నెలలు నిండక ముందే అనగా 37 వారాల గర్భం పూర్తి కాక ముందే పుడతారని కిమ్స్ కడల్స్ నియోనాటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్, ఎన్ఐసీయూ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ నియోనాటాలజీ అండ్ పీడియాట్రిక్స్ డాక్టర్ అపర్ణ అన్నారు. తల్లికి ఎక్కువగా రక్తపోటు, మధుమేహం ఉండి

కిమ్స్ కడిల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీమెచ్యూర్ డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వాకథాన్‌కు జెండా ఊపి ప్రారంభిస్తున్న సినీ నటులు ఆది, సాయి కుమార్

అవి నియంత్రణలోకి రాకపోవడం, ఉమ్మనీరు లీక్ అవ్వడం ఇలాంటి కారణాలతో ముందే పుడతారన్నారు. సరైన సమయంలో, సరైన దవాఖానలో ప్రసవం ప్లాన్ చేసుకుంటే 90 శాతం మంది పిల్లలు బాగానే ఉంటారన్నారు. సాధారణంగా తల్లులకు స్టెరాయిడ్స్ ఇస్తామని, ఇచ్చిన 24 గంటల తరువాత ప్రసవం అయితే పిల్లలు బాగుంటారన్నారు. మెదడును సంరక్షించేందుకు మెగ్నిషియం సల్ఫేట్ ఇంజక్షన్ కూడా అందించనున్నట్లు తెలిపారు. దీని వల్ల పిల్లల మెదడు బాగుంటుందన్నారు. ఎన్ఐసీయూ సదుపాయం ఉన్నచోట ప్రసవం జరిగేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. అనంతరం నెలలు నిండక ముందే పుట్టే పిల్లల విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అన్నారు. పుట్టిన వెంటనే అవసరానికి తగిన విధంగా చికిత్స అందించాలన్నారు. కిమ్స్ కడిల్స్‌లో తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. ఎంతో మంది నిపుణులైన వైద్యులు ఉండటంతో నెలలు నిండక ముందే పుట్టే పిల్లలకు సాధారణ జీవితం అందించగలుగుతున్నామన్నారు. వాకథాన్‌లో పలువురు వైద్య నిపుణులు, పీడియాట్రిషియన్లు, నర్సులు, లాక్టేషన్ కన్సల్టెంట్లు, దవాఖాన నుంచి 2 కిలో మీటర్ల మేర ప్రీమెచ్యూర్ పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి వాకథాన్ చేశారు. ఇందులో 560 గ్రాముల బరువుతో పుట్టిన చిన్నారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

కనుల పండువగా మరింగంటి పురస్కార ప్రదానోత్సవం

ఆర్కేపురం, నవంబర్ 17: శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్య 20వ స్మారక సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాసవీ కాలనీలోని వాసవీ ఆధ్మాత్మిక కేంద్రంలో ఉత్తమ సంస్కృత పండిత సన్మానం, ఉత్తమ సంస్కృత విద్యార్థి ప్రోత్సాహక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి హాజరై కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ సంస్కృత పండిత పురస్కారాన్ని-2024 శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యులు, విద్యార్థి ప్రోత్సాహక పురస్కారాన్ని కె.రాజుకు రామానుజ జీయర్ స్వామి అందజేసి మంగళ శాసనాలు చేశారు. ఈ సభలో ప్రధానంగా రెండు గ్రంథాలతో పాటు శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యుల శ్రీరామాయణం, సుందరకాండలోని ప్రవచనాల సీడీని ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా హాజరైన శ్రీమాన్ ఎస్వీ రంగ రామానుజాచార్యులు మరింగంటి వేంకట నరసింహాచార్యుల 'కృతులు-పరిశీలన' గ్రంథాన్ని ఆవిష్కరించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి మరింగంటి శ్రీరంగచార్య స్వామి వైభవ సంగ్రహం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రిదండి దేవనాథ జీయర్ స్వామి మాట్లాడుతూ, మరింగంటి శ్రీరంగాచార్య స్వామి చేసిన సేవలను ఎంత కొనియాడినా.. తక్కువేనని తెలిపారు. వారి రామాయణం, తిరుప్పావై ప్రవచనాలు ఎంతో ప్రాచుర్యం పొందినవని, వారి పేరున పురస్కారం పండితునికి, విద్యార్థికి ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి ప్రవచనాలు నేటికి ఎంతో విశిష్టతను కలిగినవని, అవి సీడీ రూపంలో రావడం అందరి అదృష్టమన్నారు. చిలుకమర్తి లక్ష్మీనాథాచార్యుల అధ్యక్షత వహించిన కార్యక్రమంలో శ్రీమాన్ పాలెం రంగాచార్యులు, రంగి సత్యనారాయణ, ఎల్వీ సుబ్రమణ్యం, పొడిచేటి సంపత్ కుమారా చార్యులు, విజయలక్ష్మి, మరింగంటి శ్రీకాంత్, విజయ సారథి పాల్గొన్నారు.

'కృతులు -పరిశీలన' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రామానుజ జీయర్ స్వామి, శ్రీమాన్ ఎస్వీ రంగ రామానుజా చార్యులు, తదితరులు

గ్రూప్-3 పరీక్షకు 41.1 శాతం హాజరు

పరీక్ష తీరును పరిశీలించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, నవంబరు 17(నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి డిగ్రీ, పీజీ కళాశాల కేంద్రంలోని గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం, అధికారులకు తగు సూచనలు చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. పరీక్ష సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దని చెప్పారు. మొదటి రోజు గ్రూప్-3 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్షకు జిల్లాలోని 102 పరీక్ష కేంద్రాల్లో 45,918 మంది అభ్యర్థులకుగాను 18,831(41,01 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. 27,087 మంది గైర్హాజరు అయ్యారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మురళీకృష్ణ, అబ్జర్వర్లు స్వప్న, మంగుబాయి పాల్గొన్నారు.

సజావుగా గ్రూప్-3 పరీక్ష

రాచకొండ సీపీ, సుధీర్ బాబు

సిటీబ్యూరో, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరిగిన గ్రూప్-3 పరీక్ష ప్రశాంత వాతావారణంలో జరిగిందని సీపీ సుధీర్ బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రామంతాపూర్ ఐటీఐ కాలేజీ, మెగా కాలేజీ తదితర కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు.

నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి కుమారుడి వివాహం మాదాపూర్ లోని హెచ్ఐసీసీలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మాజీ మంత్రులు హరీశ్ రావు దంపతులు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. – మాదాపూర్, నవంబర్ 17

సందడిగా ప్రిమిథాన్-24 ది హోప్ రన్

జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న జయేశ్ రంజన్

కొండాపూర్, నవంబర్ 17: నెలలు నిండకుండా పుట్టిన శిశువుల సంరక్షణ, చికిత్సపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న 'ప్రిమిథాన్-2024' ది హోప్ రన్ ఆదివారం సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై బ్రిటిషు డిప్యూటీ హై కమిషనర్ గరెథ్ వైన్ ఓన్‌తో కలిసి నాలెడ్జ్ సిటీలోని టీ -వర్క్స్ వద్ద జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ప్రీ మెచ్యూర్ బేబీల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎక్స్‌ట్రా మైల్ నిర్వహిస్తున్న ప్రీమిథాన్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో టీ-వర్క్స్ సీఈఓ జోగీందర్ తనికెళ్ల, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు శ్రీవారి ఉచిత దర్శనం

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని కలిసిన వేణు కుమార్

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసిన వేణు కుమార్ చుక్కల, ట్రస్టు సభ్యులు

నేరేడ్‌మెట్, నవంబర్ 17: 'నడు నడు వెంకన్న కడకు' పేరుతో ఈ నెల 28వ తారీకున 399 మంది దివ్యాంగులను తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి ఉచితంగా తీసుకెళ్తున్నట్లు శ్రీ అస్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చుక్కల మేణు కుమార్ చెప్పారు. గౌతంనగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో నమస్తే తెలంగాణతో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి 399 మంది దివ్యాంగులను ఉచితంగా తీసుకెళ్తున్నామని ఆయన ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రస్టు చైర్మన్ వేణు కుమార్ చుక్కల తిరుమలలోని గాయత్రి నిలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును శనివారం కలిసి తమ సహకారం అందించాల్సిందిగా కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి వారికి అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం, వివరాలు వెల్లడిస్తూ ఈ నెల 26న సికింద్రాబాద్‌లో బయల్దేరి 27న సాయంత్రం తిరుచానూరు అమ్మవారి దర్శనం, 28 తారీఖున తిరుమల వెంకన్న స్వామి దర్శనం చేసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. చైర్మన్ బీఆర్ నాయుడిని కలిసిన వారిలో వెంకటేశ్వర్ రావు, హరినాథ్ గౌడ్, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

శస్త్ర చికిత్స లేకుండానే వాల్వ్ మార్పిడి చికిత్సలు

హైదరాబాద్ వాల్వ్ – 2024 సదస్సులో పాల్గొన్న ప్రముఖ వైద్యులు

బంజారాహిల్స్, నవంబర్ 17: శస్త్ర చికిత్సతో అవసరం లేకుండానే గుండెకు సంబంధించిన రక్త నాళాలు, వాల్వ్‌లను మార్పిడి చేసేందుకు సరికొత్త వాల్వ్ మార్పిడి విధానాలపై 'హైదరాబాద్ వాల్వ్-2024' పేరుతో 3వ ఎడిషన్ వార్షిక సదస్సు బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో ఆదివారం ముగిసింది. 2002లో ప్రపంచంలోనే తొలిసారిగా ట్రాన్స్ క్యాథటర్ ఆర్టిక్ వాల్వ్ మార్పిడీ నిర్వహించిన ప్రొఫెసర్ అలైన్ క్లిబియర్ జ్ఞాపకార్థం ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ సదస్సులో భాగంగా అపోలో ఆస్పత్రి నుంచి ఆరు కేసుల గురించి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వైద్యులకు వివరించారు. ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్టులు 12 రకాలైన క్లిష్టమైన కేసులపై సమగ్రంగా చర్చించారు. వివిధ ఆస్పత్రుల్లో జరిగిన టీఏవీఆర్, వాల్వ్ ఇన్ వాల్వ్ టీఏవీఆర్, వాల్వ్ ఫ్రాక్షర్ టెక్నిక్స్, టీఎంవీఆర్ లాంపూన్, బాసిలికా తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో హంగేరీకి చెందిన ప్రఖ్యాత సర్జన్ డా.పీటర్ అండ్రేకా, సీనియర్ కార్డియాలజిస్ట్ డా. పీసీ రథ్, డా. మనోజ్ కుమార్ అగర్వాల్, డా. సి.మంజునాథ్, డా. గౌరవ్ ధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్టులు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, తదితరులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 17: ఏఎన్ఎం పోస్టులు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలో రెండో ఏఎన్ఎంల రాష్ట్ర మహాసభను ఆదివారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ, ఏఎన్ఎం పోస్టులు పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నోటిఫికేషన్‌లో ఉన్న 1931 ఉద్యోగాలు సరిపోవని, వారికి 3000 పోస్టులు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షలలో అర్హత సాధించలేని ఏఎన్ఎంలకు 100 శాతం గ్యాస్ శాలరీ అమలు చేయాలన్నారు. వయస్సు మీరిన వారికి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, రామస్వామి, శేఖర్ రెడ్డి, సత్యనారాయణ, మహిళ విభాగం రాష్ట్ర నాయకురాలు రామావత్ వాణి, శ్యామల, జయ, పద్మ, సువర్ణ, సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి, యాదగిరిలతో పాటు పలువురు పాల్గొన్నారు.